సాక్షి
సిద్దిపేట
గురువారం । 17 । అక్టోబర్ । 2024

కాల్వలో నుంచి కారును తీస్తున్న పోలీసులు



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



న్యూస్‌రీల్

సమన్వయంతో విధులు నిర్వహించాలి

- సిద్దిపేట అదనపు డీసీపీ మల్లారెడ్డి



మాట్లాడుతున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: రిసెప్షన్, టెక్ టీమ్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని అదనపు డీసీపీ మల్లారెడ్డి అన్నారు. రిసెప్షన్, టెక్‌టీం సిబ్బందికి సీపీ కార్యాలయంలో బుధవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీటీఎన్ఎస్ నూతన వెర్షన్ 2.0పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే ఆన్‌లైన్‌లో ప్రతిరోజు డాటా నమోదు చేయాలన్నారు. టెక్ టీమ్ సిబ్బంది పాత్ర చాలా కీలకమన్నారు. మిస్సింగ్ కేసుల ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. బెస్ట్ పోలీస్‌స్టేషన్ ఎంపిక అయ్యేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వస్తే రివార్డులు, అవార్డులు వస్తాయన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, ఐటీ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో జిల్లా స్థాయి పోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 18, 19న తేదీల్లో జిల్లా స్థాయి వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తామన్నారు.

3న ధర్మ సమాజ్ మహా సమ్మేళనం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సదన్‌కుమార్ తదితరులు

హుస్నాబాద్‌రూరల్: హైదరాబాద్‌లో నవంబర్ 3న జరిగే ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) మహా సమ్మేళనం జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్‌కుమార్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలో మహా సమ్మేళనం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సదన్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, రైల్వే, సంగరేణి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసే దిశగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. దేశంలో 2 కోట్ల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడం లేదన్నారు. 40 లక్షల బ్యాక్‌లాగ్ పోస్టులు ఖాళీలను భర్తీ చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెంచెల ఎల్లయ్య, కట్ల అంజి, వొద్దిరాల సతీష్, రాజశేఖర్, కార్తీక్ పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమిద్దాం

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత



మాట్లాడుతున్న ఆశాలత

సిద్దిపేటకమాన్: మహిళలు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఐద్వా జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు నేటి సమాజంలో అమలు కావడం లేదన్నారు. ఫలితంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. 33శాతం రిజర్వేషన్లు చట్టసభల్లో కల్పించాలని ఏళ్లుగా పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం అమలుకు కృషి చేయడం లేదన్నారు. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే విధంగా బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటన సమాజం తలదించుకునేలా చేసిందన్నారు. ఇలాంటి ఘటనలు అరికట్టాల్సిన పాలకులు నిందితులను రక్షించే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పాలకులు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మించాలని, మహిళ హక్కుల సాధన కోసం బలమైన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శోభ, మంజులత, వరలక్ష్మీ, రాజమణి, జ్యోతి, నవీన, శిరీష, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మూడు తరాల ఊపిరాగింది!

- ఉసిరికపల్లి రోడ్డు ప్రమాద మృతుల్లో దంపతులు, ఇద్దరు బిడ్డలు.. ముగ్గురు మనవరాళ్లు..
- తల్లడిల్లిన తాళ్లపల్లితండా





సంఘటన స్థలంలో మృతదేహాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/తూప్రాన్: మద్యం మత్తు, అతివేగం.. మూడు తరాలను చిత్తు చేసింది. ఏడు నిండు ప్రాణాలను బలిగొంది. శుభకార్యం జరిగిన కొద్ది గంటల్లోనే వారంతా అనంతలోకాల్లో కలిసిపోయారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఉసిరికపల్లి వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదం ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో ఏకంగా మూడు తరాలకు చెందిన వారు మృత్యువాత పడటం అందరినీ కలిచివేసింది.

శివ్వంపేట మండలం తాళ్లపల్లితండాకు చెందిన దనవాత్ శివరాం (55) దుర్గమ్మ(50) దంపతులకు నలుగురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఈ రోడ్డు ప్రమాదంలో ఈ దంపతులతో పాటు పెద్దకూతురు శాంతి (35), మూడో కూతురు అనిత (30) మృతిచెందారు. వీరి కూతుళ్లు మమత(14), శ్రావణి (9), ఇందు (7) మృత్యువాతపడ్డారు.

వేడుక కోసం వెళ్లి... కానరానిలోకాలకు..

శివరాం, దుర్గమ్మ దంపతుల రెండో కూతురు ప్రమీల సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సీతారాంపల్లితండాలో నివాసముంటున్నారు. ఎల్లమ్మ పండుగ వేడుకల్లో పాల్గొనేందుకు అక్కడికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వీరి గమ్యస్థానానికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామని అనుకున్న సమయంలో మృత్యువు కబళించింది. ఇందులో మృత్యువాత పడిన ఇందు ఎనిమిదో తరగతి, శ్రావణి ఐదో తరగతి చదువుతోంది.

అతివేగమే ప్రాణాలు తీసిందా..

కారు అతివేగంగా నడపడంతోనే అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టి అక్కడే ఉన్న బ్రిడ్జి మీద నుంచి కాలువలో పడింది. ఈ ఘటన జరిగినప్పుడు కారు వెనుక నుంచి శివరాం కుమారుడు మరో కారులో వస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారు వాగులో పడిన విషయాన్ని గమనించి వారు అటువైపు వెళ్తున్న వాహనదారుల సహాయంతో కారులో ఉన్న నామ్‌సింగ్‌ను బయటకు లాగారు. మిగతా వారిని కూడా లాగేందుకు ప్రయత్నించగా డోర్లు ఓపెన్ కాలేదు. జేసీబీని తీసుకు వచ్చి కారును బయటకు తీయగా అప్పటికే ఏడుగురు విగత జీవులయ్యారు.

మిన్నంటిన రోదనలు

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఆస్పత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. తీవ్ర విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్త బాధిత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. పలువురు నేతలు బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

అయ్యో దేవుడా.. ఎంత పని చేశావ్

తూప్రాన్: అయ్యో దేవుడా ఎంత పని చేశావ్ అంటూ తూప్రాన్‌లో ఆస్పత్రి వద్ద శివరాం చిన్నకూతురు లలిత కన్నీరుమున్నీరైంది. ఆమె రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఈ సమయంలో లలితను ఓదార్చడం ఎవరి తరం కాలేదు.



ఘటనా స్థలంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కల నెరవేరి.. కొలువుదీరి

ఈ ఫొటోలోని ఉపాధ్యాయుడి పేరు ఆవునూరి శ్రీనివాస్. డీఎస్సీ–2024లో లాంగ్వేజ్ పండిత్ విభాగంలో జిల్లా స్థాయిలో 5వ ర్యాంక్ సాధించారు. తనకు కేటాయించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విఠలాపూర్‌లో బుధవారం విధుల్లో చేరారు. కష్టానికి ప్రతిఫలం లభించిందని, తల్లిదండ్రులు ఎంతో కష్టానికి ఓర్చి తనను చదివించారని, పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటుగా క్రమశిక్షణ అలవర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని చెబుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇలా శ్రీనివాస్ మాత్రమే కాకుండా జిల్లాలో విధుల్లో చేరిన 256 మంది నూతన ఉపాధ్యాయులు తమ సంతోషాన్ని వెలిబుచ్చారు.



కొత్త ఉత్సాహంతో ఉపాధ్యాయులు

- విధులకు హాజరైన 256 మంది టీచర్లు
- తొలి రోజు సంబురంగా బోధన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 'విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే బాధ్యత తీసుకున్నాం. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే నిర్మితమవుతోంది' అని నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అన్నారు. ఉద్యోగం సాధించడానికి ఎంత శ్రమ పడ్డామో అంతకు వంద రెట్లు విద్యార్థుల భవిష్యత్‌ను నిర్మించడంలో కృషి చేస్తామన్నారు. జిల్లాలో డీఎస్సీలో నూతనంగా 256 మంది ఉపాధ్యాయులు నియామకమయ్యారు. స్కూల్ అసిస్టెంట్ 73, లాంగ్వేజ్ పండిట్ 19, పీఈటీ 8, ఎస్జీటీ 156మంది నియమితులయ్యారు. వీరందరూ ఈనెల 9న నగరంలో సీఎం చేతుల మీదుగా పత్రాలు అందుకున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయించారు. దీంతో నూతన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో ఉదయం విధుల్లో చేరారు. తొలిరోజు విద్యార్థులకు ఎంతో ఉత్సాహంతో బోధించారు. ముందుగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు.

తొలిరోజు ఇంగ్లిష్ బోధించా..



మొదటి రోజు విధుల్లో చేరగానే తోటి ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. ఏన్నో ఏళ్ల కృషి ఫలితం ఈ ఉద్యోగం. తొలిరోజు నేను విద్యార్థులకు ఇంగ్లిష్ బోధించాను. నాకు చాలా సంతోషం అనిపించింది. భవిష్యత్‌లో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తాను.

– అన్వేషిత, ఎస్జీటీ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సిద్దిపేట

ఎన్నో ఏళ్ల కల..



ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలని ఎన్నో ఏళ్ల నాటి కల. ఈ రోజు నెరవేరింది. తొలిరోజు ఉపాధ్యాయుడిగా పాఠశాలకు రావడం చాలా భావోద్వేగాన్ని కలిగించింది. ఉద్యోగమే లక్ష్యంగా కష్టపడి చదవి సాధించాను. తొలిసారి పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తుంటే కన్నీటిభాష్పాలురాలాయి. ఈ మధురమైన రోజు నా జీవితాంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

– మొలంకల నరేశ్, జెడ్పీహెచ్ఎస్ గాగిల్లాపూర్

చాలా సంతోషంగా ఉంది



2017లోనే ఎస్జీటీ ఉద్యోగం వచ్చింది. కానీ 317 జీవో కారణంగా సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పుడు నిర్వహించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్‌లో జిల్లాలో 3వ ర్యాంక్ సాధించాను. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌లో పోస్టింగ్ ఇచ్చారు. సంతోషంతో విద్యార్థులకు బోధించాను.

– రవళిక, స్కూల్ అసిస్టెంట్, ఇందిరానగర్ జెడ్పీహెచ్ఎస్, ఇందిరానగర్

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఊరట

సిద్దిపేట డయాలసిస్ సెంటర్‌కు మరో 5పడకలు మంజూరు



సిద్దిపేట డయాలసిస్ సెంటర్‌లో అందుతున్న వైద్య సేవలు

సిద్దిపేటకమాన్: కిడ్నీ వ్యాధిగ్రస్తులకు శుభవార్త. సిద్దిపేట డయాలసిస్ సెంటర్‌కు మరో 5పడకలు మంజూరయ్యాయి. అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో ప్రభుత్వ ఆస్పత్రిలో 2017లో 5పడకలతో రాష్ట్రంలోనే తొలి డయాలసిస్ సెంటర్ ప్రారంభమైంది. తర్వాత బాధితుల నుంచి విజ్ఞప్తులు రావడంతో 2019లో మరో 5పడకలు మంజూరు చేశారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతుండటంతో మళ్లీ 5పడకలు మంజూరయ్యాయి. మొత్తం 15 పడకలతో సెంటర్‌లో డయాలసిస్ సేవలు అందనున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. త్వరలోనే ఈ మెషీన్‌లు అందుబాటులోకి రానున్నట్లు కిడ్నీ సమస్యతో బాధపడేవారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని హరీశ్‌రావు సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో మొత్తం 15 పడకలు అందుబాటులోకి రానున్నాయి. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడేవారు. వారిని దృష్టిలో ఉంచుకుని ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. వ్యాధిగ్రస్తులు సేవలను సద్వినియోగం చేసుకోవాలి. సెంటర్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 78వేల సెషన్స్ డయాలసిస్ సేవలు అందాయి.

– హరీశ్‌రావు మాజీ మంత్రి, ఎమ్మెల్యే

కేంద్రీయ విద్యాలయాన్ని తీర్చిదిద్దండి

- వారం రోజుల్లో సొంత భవనంలోకి మార్చాలి
- కలెక్టర్ మనుచౌదరి ఆదేశాలు



కేంద్రీయ విద్యాలయ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటఅర్బన్: కేంద్రీయ విద్యాలయాన్ని అద్దె భవనం నుంచి సొంత భవనంలోకి తరలించాలని కలెక్టర్ మనుచౌదరి విద్యాలయం ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్‌ను ఆదేశించారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలోని కేంద్రీయ విద్యాలయం భవనం, మిట్టపల్లిలో సుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లే అవుట్, అద్దె భవనంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ మహిళల గురుకుల డిగ్రీ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయ నూతన భవన నిర్మాణం పూర్తయినందున మొక్కలను నాటి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ఆవరణలో ప్లే గ్రౌండ్‌ను సిద్ధం చేయాలని సూచించారు. సుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో 111 ప్లాట్లలో గతంలో వేలంలో అమ్ముడుపోగా మిగిలిన 98 ప్లాట్ల ధరను తగ్గించి మరోసారి వేలం నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సాంఘిక సంక్షేమ మహిళల గురుకుల డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలు గురించి ఆరా తీశారు. జిల్లా మహిళా సమాఖ్య భవనం సమీపంలో కళాశాల భవన నిర్మాణం కోసం కేటాయించిన 5 ఎకరాలలో వెంటనే భవన నిర్మాణాన్ని ప్రారంభించాలని ఈఈని ఫోన్‌లో ఆదేశించారు.


ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- పోలీసుల కోసం ప్రత్యేక ఆరోగ్య ప్రొఫైల్
- పోలీస్ కమిషనర్ అనురాధ

నంగునూరు(సిద్దిపేట): విధులు అంకిత భావంతో నిర్వర్తిస్తూనే ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని పోలీస్ కమిషనర్ అనురాధ సిబ్బందికి సూచించారు. రాజగోపాల్‌పేట పీహెచ్‌సీలో బుధవారం పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రక్త నమూనాలను అందజేసి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. నిరంతరం విధుల్లో ఉండే పోలీసులు ఆరోగ్యంగా ఉండేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని 56 రకాల వైద్య పరీక్షలు నిర్వహించేలా కృషి చేశారన్నారు. జిల్లాలో 26 పోలీస్‌స్టేషన్లకు 1,450 సిబ్బంది ఉండగా వారం రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మన ఆరోగ్యం మన చేతిలోనే ఉందని ప్రతి రోజూ వ్యాయామం, ధ్యానం, యోగా చేస్తూ సాత్విక ఆహారం, పండ్లు, పాలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జీ డీఎంహెచ్‌ఓ ఆనంద్ మాట్లాడుతూ కోవిడ్ తరువాత ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. జీవనశైలిని మార్చుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకొని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ మల్లారెడ్డి, ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఏసీపీ మధు, డిప్యూటీ డీఎం హెచ్‌ఓ శ్రీనివాస్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తారా?

- నేవీ రాడార్‌కు నాడు అనుమతిచ్చి ఇప్పుడు నాటకాలా?
- బీఆర్ఎస్ తీరుపై నర్సారెడ్డి ఆగ్రహం



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్: నేవీ రాడార్ కేంద్రానికి బీఆర్ఎస్ హయాంలోనే అనుమతులిచ్చారని, నేడు వారే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గజ్వేల్‌లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు తన నివాసంలో బీఆర్ఎస్, బీజేపీల నుంచి నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పేరిట రాష్ట్రాన్ని దివాలా తీయించి నేడు కేటీఆర్, హరీశ్‌రావులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. 2017లో దామగుండం అటవీ ప్రాంతంలో రాడార్ కేంద్రానికి బీఆర్ఎస్ అనుమతి ఇచ్చిన విషయం మరిచిపోయారా? అంటూ ప్రశ్నించారు. మరోవైపు మూసీ నిర్వాసితులను రెచ్చగొడుతూ రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ తీరును ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



నిల్వ చేసిన బియ్యం బస్తాలు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని గుంటుకు విఠల్ నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తహసీల్దార్ కృష్ణ పేర్కొన్నారు. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వేరే ప్రాంతంలో అమ్ముతున్నారని వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఘటనకు సంబంధించి సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

కానిస్టేబుల్ దురుసు ప్రవర్తన

దామరచెరువు గ్రామస్తుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

రామాయంపేట(మెదక్): స్థానికంగా పని చేస్తున్న ఓ పోలీస్ కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ మండలంలోని దామరచెరువు గ్రామస్తులు బుధవారం రాస్తారోకో చేపట్టారు. వారి కథనం మేరకు.. దుర్గామాత నిమజ్జనం రోజు గ్రామానికి చెందిన ఓ మహిళ చేసిన వ్యాఖ్యలు ధుమారం లేపాయి. దీంతో గ్రామస్తులు ఆమెను పిలిచి మందలించారు. ఈ క్రమంలోనే స్థానికంగా పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ గ్రామ పెద్దలపై ఆగ్రహం వ్యక్తం చేసి దుర్భషలాడారు. తమ ఊరి కట్టుబాట్ల విషయంలో పోలీస్ జోక్యం వ్యతిరేకిస్తూ గ్రామస్తులు రామాయంపేటకు వచ్చే రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకట్ రాజాగౌడ్ గ్రామస్తులను సముదాయించి వారితో ఆందోళన విరమింపజేశారు. ఈవిషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యారంగంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం : రమణాకర్

గజ్వేల్‌రూరల్: విద్యారంగంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం తగదని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని సాహసం(సామాజిక హక్కుల సంఘం) జిల్లా అధ్యక్షుడు కానుగుల రమణాకర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఐవోసీలో ఆర్డీవో బన్సీలాల్‌కు విద్యార్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం రమణాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఆర్థికభారంతో చదువులకు దూరమవుతున్నారని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఇదే విధంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం లేదని ఆరోపించారు. పాలక ప్రభుత్వాల తీరుతో విద్యార్థులు నష్టపోతున్నారని, ఇప్పటికైనా స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై సమష్టి పోరాటం: హరీశ్‌రావు

పటాన్‌చెరు: కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజాసమస్యలపై సమష్టిగా పోరాటం చేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బుధవారం పటాన్‌చెరు బీఆర్ఎస్ ముఖ్యనేతలు గడీల శ్రీకాంత్‌గౌడ్, వెన్నవరం సింధు, మెట్టుకుమార్‌తో పాటు ఇతర నాయకులతో సమావేశమై స్థానిక రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అయితే, నియోజకవర్గం ఇన్‌చార్జి అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని తెలిసింది. పటాన్‌చెరు మండలాలపై పట్టు ఉన్న నాయకులను ఆయా మండలాలకు ఇన్‌చార్జిలుగా నియమించాలని సూచించినట్లు తెలిసింది.

పత్తి కొనుగోళ్లకు సిద్ధం

ఉమ్మడి మెదక్ జిల్లాలో 32 జిన్నింగ్ మిల్లులు నోటిఫై

- సిద్దిపేట, మెదక్‌లలో ప్రక్రియ పూర్తి
- సంగారెడ్డిలో ఆమోదమే తరువాయి
- ఆయా జిల్లాల్లో 4.28 లక్షల ఎకరాల్లో పత్తి సాగు
- 30 లక్షల క్వింటాళ్లకు పైగా దిగుబడులు వచ్చే అవకాశం



గజ్వేల్‌లోని ఓ మిల్లులో పత్తి కొనుగోళ్లు

ఉమ్మడి మెదక్ జిల్లాలో సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వ్యవహారం కొలిక్కి వచ్చింది. ఇందుకోసం 32 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేశారు. సిద్దిపేటలో 16, మెదక్‌లో ఒక జిన్నింగ్ మిల్లుకు సంబంధించిన నోటిఫై పూర్తికాగా, సంగారెడ్డి జిల్లాలో 15 కేంద్రాలకు సంబంధించి నోటిఫై అంశం ఉన్నతాధికారుల ఆమోదమే తరువాయిగా ఉన్నది. ఈ లెక్కన ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఆయా జిన్నింగ్ మిల్లులు సీసీఐ కేంద్రాలుగా మారనున్నాయి. – గజ్వేల్ :

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈసారి పత్తి 4.38 లక్షల ఎకరాల్లో సాగులోకి వచ్చింది. సంగారెడ్డిలో అత్యధికంగా 3 లక్షల ఎకరాలు, సిద్దిపేటలో 1.04 లక్షల ఎకరాలు, మెదక్‌లో 34 వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. గతంతో పోలిస్తే ఈసారి తొలుత అనావృష్టి, ఆ తర్వాత అతివృష్టితో పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగింది. ఈ క్రమంలోనే సుమారుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 లక్షల క్వింటాళ్లకుపైగా దిగుబడులు రావచ్చని మార్కెటింగ్‌శాఖ అంచనా వేస్తోంది. గతేడాది పత్తికి మద్దతు ధర రూ.6,620 నుంచి రూ.7,020 ఉండగా.. ప్రస్తుత సీజన్‌లో గరిష్టంగా రూ.7,521 నుంచి కనిష్టంగా రూ.7,124 మద్దతు ధరగా చెల్లించనున్నారు. తేమ శాతం 8 నుంచి 12కు మించకూడదని సూచిస్తున్నారు.

జిన్నింగ్ మిల్లులకు, సీసీఐకి మధ్య ఏకాభిప్రాయం

ఉమ్మడి జిల్లాలోని సంగారెడ్డిలో 20, సిద్దిపేటలో 21, మెదక్‌లో 2 కలుపుకొని 43 జిన్నింగ్ మిల్లులు ఉండగా.. ఈ సీజన్‌లో పత్తి కొనుగోళ్లకు కోసం సిద్దిపేట జిల్లాలో 16, మెదక్‌లో ఒక మిల్లును మాత్రమే నోటిఫై చేశారు. సంగారెడ్డికి సంబంధించి 15 మిల్లులకు నోటిఫై ఆమోదం పొందలేదు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్నేళ్లుగా వీటినే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల రైతుల వద్ద సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు క్వింటాల్‌కు సీసీఐ ప్రమాణాల ప్రకారం సుమారుగా 34 కిలోలకు పైగా దూదిని, మరో 65 కిలోల వరకు గింజలను వేరు చేసి ఇస్తారు. మిగితాది ప్రాసెస్ కింద పరిణిస్తారు. అంతేకాకుండా దూదిని బేళ్లుగా తయారుచేసి ఇచ్చినందుకు సీసీఐ జిన్నింగ్ చార్జి పేరిట మిల్లుల యాజమాన్యాలకు ఇస్తుంది. ఈ అంశంలో జిన్నింగ్ మిల్లులకు, సీసీఐకి మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో నోటిఫై ప్రక్రియ పూర్తయ్యింది.

సక్రమంగా సాగితేనే మేలు

ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోళ్లు సక్రమంగా సాగితేనే రైతులకు మేలు జరిగే అవకాశముంది. లేక నష్టం వాటిల్లుతుంది. సీసీఐ కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో పత్తిని అమ్ముకోవడానికి వస్తున్న రైతులకు వ్యాపారులు క్వింటాల్‌కు రూ.6,500 మించి చెల్లించడం లేదు. తేమ పేరుతో దోపిడీ చేస్తున్నారు. సీసీఐ అధికారులు సైతం తేమ పేరుతో ఇంకా జాప్యం చేయకుండా కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. సీసీఐ కేంద్రాల అంశంపై సిద్దిపేట మార్కెటింగ్ అధికారి నాగరాజు మాట్లాడుతూ.. సీసీఐ కేంద్రాల నోటిఫై అంశాన్ని ధ్రువీకరించారు. కేంద్రాల్లో కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చూస్తామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ లక్ష్యమన్నారు.

పారదర్శకంగా ధాన్యం సేకరించాలి

- జిల్లాలో 417 కొనుగోలు కేంద్రాలు
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా పారదర్శకంగా ధాన్యం సేకరణ చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేందుకు బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో కేంద్రాల నిర్వాహకులకు, ఏఈఓలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకొచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా చూడాలన్నారు. జిల్లాలో 3 లక్షల 17 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేయడం జరిగిందన్నారు. మొత్తం దిగుబడి 8 లక్షల 3 వేల 530 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండగా, రైతుల అవసరాలు, బహిరంగ కొనుగోళ్లు పోగా 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 417 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, అన్ని యంత్రాలు, సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. గోడౌన్‌ల వివరాలు సమస్యల పరిష్కారానికి జిల్లా కంట్రోల్ రూం నంబర్ 79950 50808, 79950 50808, రాష్ట్ర కంట్రోల్ రూం నంబర్ 1967, 180042500333 నంబర్‌లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా, డీసీఎస్ఓ తనూజ, డీఎం హరీశ్, సీఎస్‌సీ, డీఏఓ, డీసీఓ, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో స్టీల్ కొనేందుకు చూసి..

రూ.9.78 లక్షలు పోగొట్టుకున్న వ్యాపారి

పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్‌లో స్టీల్ కొనేందుకు చూసి సైబర్ వలలో పడి భారీ ఎత్తున డబ్బు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం చిటుకుల్ గ్రామానికి చెందిన ఓ వ్యాపారి ఇంటి నిర్మాణం కోసం స్టీల్ కొనేందుకు 6వ తేదీన ఆన్‌లైన్‌లో వెతుకుతుండగా ఓ నంబర్ కనిపించింది. బాధితుడు ఆ నంబర్‌కి ఫోన్ చేసి అతడికి కావాల్సిన స్టీల్ మెటీరియల్ కోసం మాట్లాడుకున్నాడు. అపరిచిత వ్యక్తి స్టీల్‌కు 50 శాతం నగదు చెల్లించాలని చెప్పడంతో రూ.9.78 లక్షలు చెల్లించాడు. అనంతరం అతడు స్పందించకపోవడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైం పోలీసులకు, బుధవారం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లక్నో పోలీసులమంటూ రూ.4.28 లక్షలు బురిడీ

మరో ఘటనలో పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ ఐటీ ఉద్యోగికి సెప్టెంబర్ 30వ తేదీన అపరిచిత వ్యక్తుల నుంచి లక్నో పోలీసులమంటూ ఫోన్ కాల్ వచ్చింది. నీ ఆధార్‌పై తీసుకున్న నంబర్‌తో ఇల్లీగల్ కార్యక్రమాలతోపాటు మనీ ల్యాండరింగ్ కేసులు ఉన్నాయని చెప్పారు. వీడియో కాల్ చేసి మరీ పోలీస్ యూనిఫామ్‌లో మాట్లాడారు. దీంతో భయపడ్డ ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.4.28 లక్షలు పంపించాడు. మళ్లీ డబ్బులు అడగడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండుగకు పుట్టింటికి పంపలేదని..

పురుగుల మందు తాగి వివాహిత బలవన్మరణం



సౌమ్య (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): దసరా పండుగకు పుట్టింటికి పంపలేదని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పీ.నీరేశ్ కథనం మేరకు.. ఆకునూరు గ్రామానికి చెందిన పెంటపర్తి శ్రావణ్‌రెడ్డికి హన్మకొండ జిల్లా, ధర్మసాగర్ మండలం, క్యాతంపల్లికి చెందిన సౌమ్య (24)తో నాలుగేళ్ల కిందట వివాహమైంది. కొద్ది రోజులుగా సౌమ్య తల్లిదండ్రులు గొడవపడి వేర్వేరుగా ఉంటున్నారు. ఇదే గొడవ విషయాన్ని సౌమ్య తండ్రి రాంరెడ్డి అల్లుడైన శ్రావణ్‌కి ఫోన్ చేసి చెప్పాడు. అత్తమ్మ, నేను వేర్వేరుగా ఉంటున్నామని పండుగకు పంపొద్దన్నాడు. దీంతో సౌమ్యని పండుగకు పంపలేదు. మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలికి 14 నెలల పాప ఉంది. తల్లి మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో ఉరేసుకొని వ్యక్తి..

తొగుట(దుబ్బాక): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కాన్గల్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన ముడికె యాదయ్య (40) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. మద్యం మత్తులో గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఐలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి..

చేగుంట(తూప్రాన్): రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వడియారం శివారులో బుధవారం చోటు చేసుకుంది. నిజామాబాద్ రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి కథనం మేరకు.. మండలంలోని వడియారం మాసాయిపేట రైల్వే స్టేషన్‌ల మధ్యలో వడియారం శివారులో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించాం. మృతుడి వయస్సు 50 ఏళ్లకు పైబడి ఉంటుందని, కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎదురెదురుగా రెండు బైక్ ఢీ

ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు



భాగయ్య (ఫైల్)

దుబ్బాక: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన రైతు సుకూరి భాగయ్య(50), భార్య ఎల్లవ్వతో కలిసి బుధవారం దుబ్బాక మండలంలోని పెద్దచీకోడ్ గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి బైక్‌పై వచ్చారు. సాయంత్రం దుబ్బాక మీదుగా స్వగ్రామానికి వెళ్తున్నారు. ఇదే సమయంలో పోతారం గ్రామానికి చెందిన గడీల శ్రీనివాస్ రెడ్డి దుబ్బాకలో పని ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో దుబ్బాక నుంచి పెద్దచీకోడ్ వెళ్లే రహదారిలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భాగయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్యకు, శ్రీనివాస్ రెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం సిద్దిపేటకు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని దుబ్బాక పోలీసులు తెలిపారు.

సిమెంట్ మిల్లర్‌లో పడి కూలీ మృతి



సాగీర్ మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సిమెంట్ మిల్లర్‌ను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి కూలీ మృతి చెందిన ఘటన తెల్లాపూర్‌లో చోటు చేసుకుంది. కొల్లూర్ పోలీసుల కథనం మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన సాగీర్ (20) జీవనోపాధి నిమిత్తం రెండేళ్ల కిందట హైదరాబాద్‌కు వలసొచ్చాడు. శేరిలింగంపల్లి పరిధిలోని గోపనపల్లి తండాలో నివాసం ఉంటూ తెల్లాపూర్‌లోని ఓ నిర్మాణ సంస్థలో కూలీగా పని చేస్తున్నాడు. బుధవారం సిమెంట్ మిల్లర్‌ను శుభ్రం చేస్తూ అందులో పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రెడిమిక్స్ సంస్థ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే సాగీర్ మృతి చెందాడని సోదరుడు జహంగీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సేవలను వినియోగించుకోవాలి

- వినికిడి సమస్యలు గుర్తించి సర్జరీ
- సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యులు విమలాథామస్, శాంతి



సేవలు ప్రారంభిస్తున్న మెడికల్ కళాశాల డాక్టర్లు విమలాథామస్, శాంతి

సిద్దిపేటకమాన్: వినికిడి సమస్యతో బాధపడే వారు ప్రభుత్వాస్పత్రిలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శాంతి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఈఎన్‌టీ విభాగంలో రూ.5 లక్షల విలువైన ప్యూర్ టోన్ ఆడియో మీటర్, ఇన్‌పిడెన్స్ ఆడియో మీటర్ మెషిన్స్‌లను (పరికరాలు) బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినికిడి సమస్యతో బాధపడే వారికి మెషిన్స్ ద్వారా పరీక్షలు నిర్వహించి వినికిడి సమస్య ఏ స్థాయిలో ఉందో గుర్తించొచ్చు అన్నారు. సమస్యను గుర్తించి అవసరమైన వారికి టింపోనా ప్లాస్టి, స్టెఫిడెక్టమీ, మ్యోసిటాడెక్టమీ సర్జరీల ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. సుమారు రూ.లక్ష విలువైన సర్జరీలను ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. వినికిడి సమస్య ఉన్న వారిని సదరం శిబిరంలో ఈ మెషిన్స్ ద్వారా గుర్తించి అర్హులైన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సైకియాట్రీ విభాగ హెచ్ఓడీ డాక్టర్ శాంతి, ఈఎన్‌టీ విభాగ హెచ్ఓడీ డాక్టర్ నాగరాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అమీద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కడవేర్గు ప్రణీత్‌కుమార్, డాక్టర్ సురేశ్ బాబు, డాక్టర్ చేతన్ రాహుల్, ఆర్ఎంఓలు జ్యోతి, సిబ్బంది నరేశ్, అనిల్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలబాలికల జట్లు

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కైలాసం పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో బుధవారం సబ్ జూనియర్ బాలబాలికల విభాగంలో క్రీడా జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18, 19, 20 తేదీల్లో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు జరుగనున్నాయన్నారు. జట్ల ఎంపికలో వివిధ ప్రాంతాలకు చెందిన 45 మంది బాలికలు, 40 మంది బాలురు హాజరయ్యారని తెలిపారు. వీరిలో ప్రతిభను చాటిన బాలికలు 16 మంది, బాలురు 16 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. బాలికలు వరంగల్‌లో, బాలురు తూప్రాన్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు వెంకటేశ్, రమేశ్, బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి విగ్రహం ధ్వంసం

పరిశీలించిన అదనపు ఎస్పీ సంజీవరావు



ధర్నా చేస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణంలోని హనుమాన్ మందిరంలో గల వినాయకుడు విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం భక్తులు మందిరంలో పూజలు చేయడానికి వెళ్లగా విషయాన్ని గుర్తించి ప్రభుమందిర్, హనుమాన్ మందిరాల అభివృద్ధి కమిటీ సభ్యులకు తెలిపారు. విశ్వహిందూపరిషత్ సభ్యులు, బీజేపీ, హిందూ సంఘాల నాయకులకు సైతం విషయం తెలియడంతో భారీగా తరలివచ్చారు. వినాయక విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం సీఐ మహేశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా బీజేపీ కో కన్వీనర్ కోవూరి సంగమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, పార్టీ నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని విగ్రహాన్ని పరిశీలించారు. అలాగే జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్యగౌడ్‌లు వినాయక విగ్రహాన్ని, పరిసర ప్రాంతాలను బుధవారం రాత్రి పరిశీలించారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షిస్తామన్నారు.

సింగాయపల్లిలో దేవతామూర్తుల విగ్రహాలు..



ధ్వంసమైన విగ్రహాలు

వర్గల్(గజ్వేల్): మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆలయం వద్ద విగ్రహాలను ధ్వంసం చేశాడు.ఈ ఘటన వర్గల్ మండలం సింగాయపల్లిలో చోటు చేసుకుంది. గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సింగాయపల్లికి చెందిన కొప్పోజి వెంకటస్వామిచారి(30) మంగళవారం రాత్రి మద్యం సేవించి అదే మత్తులో గ్రామ శివారులోని పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద ఉన్న దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసం చేశాడు. బుధవారం ఉదయం విగ్రహాలు ధ్వంసమైనట్లు గ్రామస్తులు గుర్తించి గౌరారం పోలీసులకు సమాచారమిచ్చారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి, నిందితుడు వెంకటస్వామిచారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపుతామని ఏసీపీ పేర్కొన్నారు.

రూ.10 నోట్ల కొరత



- మార్కెట్ లో తగ్గిన చలామణి
- ఆన్‌లైన్ చెల్లింపులు అధికం
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారస్తులు



పూజా సామగ్రి దుకాణంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ స్కానర్

ఝరాసంగం(జహీరాబాద్): మార్కెట్‌లో రోజు రోజుకూ రూ.10 నోట్ల కొరత ఏర్పడుతుంది. వీటి చలామణి తగ్గడంతో వ్యాపారస్తులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతకాలంగా మార్కెట్లోకి కొత్త నోట్లు రాకపోవడంతో చిరిగిపోయిన నోట్లే దర్శనమిస్తున్నాయి.

వ్యాపారులకు చిల్లర కష్టాలు

రూ.10 నోట్లు రాకపోవడంతో గిరాకీలు తగ్గిపోతున్నాయని వ్యాపారస్తులు వాపోతున్నారు. కిరాణం దుకాణాలు, హోటళ్లు, పెట్రోల్ బంక్‌లు, ఫ్యాన్సీ, చిన్నపిల్లల ఆట వస్తుల దుకాణం, కూరగాయలతోపాటు వివిధ దుకాణదారులు ప్రతి రోజూ చిల్లర కోసం కొనుగోలుదారులతో ఇబ్బంది పడాల్సివస్తుంది. దుకాణంలో రూ.100 ఇస్తే తిరిగి కొనుగోలుదారుడికి చిల్లర ఇవ్వాల్సి వస్తే రూ.10 నోట్లు ఉండటం లేదు. గతంలో నాణేల కొరత ఉన్న సమయంలో చిల్లరకు బదులుగా చాక్లెట్లు ఇచ్చేవారు. ఇప్పుడు రూ.10 కి బదులుగా ఏమి ఇవ్వాలో తెలియడం లేదని వ్యాపారస్తులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా కొత్త నోట్లు రాకపోవడంతో చిరిగిన నోట్లు కనిపిస్తున్నాయి. పలు సందర్భాల్లో చిరిగిన నోట్లు తీసుకోవడం లేదని వ్యాపారస్తులు, వినియోగదారులు వాపోతున్నారు.

అంతా ఆన్‌లైన్‌లోనే..

రూ.10 నోట్లు తగ్గిపోవడంతో ఆన్‌లైన్ చెల్లింపులు అధికమవుతున్నాయి. కరోనా సమయం నుంచి ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ చెల్లింపులకు ఆసక్తి చూపిస్తున్నారు. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ నుంచి మొదలుకొని చిన్న దుకాణాల వరకు ఆన్‌లైన్ చెల్లింపులు కొనసాగుతున్నాయి. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంతో పాటు వివిధ రకాల యాప్‌లతో సులభతరంగా చెల్లింపు చేసేందుకు బ్యాంక్ అకౌంట్‌కి సంబంధించిన క్యూఆర్ స్కానర్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు.అందరూ ఆన్‌లైన్ పే చేయడంతో నోట్లు రావడం లేదు.

ఇబ్బందులు పడుతున్నాం



రూ.10 నోట్లు దొరక్కపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కొన్నేళ్లుగా కొత్త నోట్లు రావడం లేదు. చిరిగిన నోట్లు మాత్రమే కనిపిస్తున్నాయి. రూ.10 చిల్లర ఇవ్వాల్సిన సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు.

– ఎండీ అన్సర్, కిరాణం దుకాణం, ఝరాసంగం

ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తున్నారు



కొంతకాలంగా రూ.10 నోట్లు దొరకడం లేదు. కేతకి సంగమేశ్వర ఆలయానికి వచ్చే భక్తులు ఏదైనా వస్తువు కొనుగోలు చేసిన సమయంలో రూ.10 ధర ఉంటే కొంతమంది కొనుగోలు చేయకపోగా, మరి కొంతమంది ఆన్ లైన్ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. దీంతో నోట్లు రావడం లేదు.

– టీ.నగేశ్, పూజా సామగ్రి దుకాణం, ఝరాసంగం